పురుష సహచరియగు మహేశ్వరికి, పతితోడి రహో విలసితము - పర్యంకమునందువలె, మదీయమగు పంచచామరస్తబకమునందుఁగూడనగు ననునంశమును ఇందలి మంచపదము ధ్వనింపఁజేయుచున్నది. ఈ పంచచామరస్తబకమునందంతటను ఈశ్వరోపన్యా సద్వారముననే ఈశ్వరి యొక్క స్వరూపము వివరింపబడుట వలనను, ఈశ్వరునికంటెవేరుగానున్నట్లు చెప్పఁబడినను, ఈశ్వరుని గూడి యే యుండినట్లు చెప్పుటవలనను, ఇందలి పంచచామరసముదాయము - మంచరూపముగా నారోపించఁబడుట - యౌచిత్య పోషకమే యగుచున్నది.

ఇందు - పదములు - పదములుగను (అంకములుగను) శయ్య - శయ్యగను, శ్లేషముచే నారోపింపఁబడినవి. పంచచామరములు - మంచముగా నారోపింపఁబడినవి, కావున నిందలి యలంకారము - శ్లేషోజ్జీవితమగు రూపకాలంకారమగుచున్నదని యెఱుంగునది.

ఇది 'సవ్యాఖ్యమగు ద్వితీయ స్తబకము.

****



ఓమ్ శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః
శ్రీ సరస్వతీ దేవ్యై నమః
ఓమ్ నమో భగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ప్రథమ శతకమునందలి తృతీయ స్తబకము)

**అవ :-** తృతీయమగు నీస్తబకమున - పురుష - శక్తులకు శరీరముకలదా, లేదా యను విషయమున వికల్ప భేదముల నుపన్యసించి వారిద్దఱును లీలావిగ్రహధరులని ప్రతిపాదించి కీర్తించుచున్నాఁడు.

మూ॥ శుభ్రస్మితలేశో మాతుర్మరుతాన్నః
అన్తస్తిమిరాణా మస్తం విదధాతు ॥ 1

("ద్విరదగతి" అనురగడ). అదె మరుజ్జనని శుభ - మృదుహాసలేశంబు
హృదులఁ జీకటులెల్ల - విదలించుఁగావుతను ॥

మరుత్తులకుఁ దల్లియగు శచీ దేవియొక్క శుచియగు మందహాసము (చిరునవ్వు) మాహృదయములయందున్న చీకటులను - (బహు విధములగు నజ్ఞానములను) తొలగింపఁ జేయును గావుత!

**ప్రభ:-** ఇంద్రుడు - మరుత్తులకుఁ దండ్రి, 'ఇంధతి' అనుధాతువునుండి యేర్పడుటవలన - ఇంద్రశబ్దమున కర్థము - పరమేశ్వరుఁడే యగుచున్నాఁడు.

కావున నింద్రశక్తి యగుశచీ దేవి - 'ఈశ్వరి' అగుచున్నది. ఆమెయే ఇంద్రాణి' అని కూడ చెప్పఁబడును.

మూ॥ ఆద్యౌ భువనానాం మాతాపితరౌతౌ
దేవా సురమ్మర్త్యై ర్వన్ద్యౌ పవినన్త్యౌ ॥ 2

ఎల్లరును వారి నుతియింత్రు, లోకులకెల్ల
తల్లిదండ్రులు - పవిత్రాత్ములాద్యులు వారు ॥

ఆయింద్రుండును – ఇంద్రాణియును – ప్రపంచములకు మొదటివారు. వారికంటె ముందెవ్వరును జన్మింపలేదు. పరమార్థమున వారికి జన్మము సంభవించునది కాదు. అయినను సృష్టి చేయుటకై మిథున రూపమున జన్మించియున్నారు. కావున వారేలోకముల కన్నింటికిని దల్లిదండ్రులు.

దేవతలు – రాక్షసులు – మనుష్యులు – మొదలగు వారెల్లరును వారిని పూజింతురు. జగద్ వ్యాపారమున స్వయముగా నియుక్తులయినను ప్రపంచ దోషముల నంటనివారు కావున వారు – పవిత్రాత్ములు.

మూ॥ బ్రూతే పృథగేకస్తౌ విగ్రహవన్తౌ ।
ఆహైకశరీరం ద్వన్ద్వం కవిరన్యః ॥ 3

ఒకఁడు ''వారలు భేదయుత దేహు'' లనిపల్కె-
ఒక సుకవి - '' ఏక దేహులగు ద్వంద్వం'' బనియె.

ఆ యీశ్వరులను గూర్చి మత భేదము లెన్ని యోయున్నవి. ఒక పండితుడు వారిద్దఱికిని వేర్వేరగు శరీరములు కలవు' అని చెప్పుచున్నాఁడు.

వేఱొకకవి 'శరీరమొక్కటియే ద్వివిధముగా విభజింపఁబడి యున్నది' అనుచున్నాఁడు. కావుననే యీ లోకమునందు వారికి 'అర్ధనారీశ్వర' వ్యవహార మేర్పడియున్నది.



ప్రభ :- ఈశ్వరీ – ఈశ్వరులు – వియుక్తులు (విడివడి యుండినవారు) అని చెప్పుట – రసపరతంత్రుఁడగు కవికిష్టముకానేరదు – కావున వారు – విడివడియుండరని చెప్పుటకు – కల్పనా సమర్థుఁడగు కవి – వారికిఁ గరచరణాదులను కల్పించి – ద్వివిధముగా విభజించి – ఈశ్వరికి – వామ భాగమును, ఈశ్వరునకు దక్షిణభాగమును, సమర్పించుచున్నాఁడని భావము.

మూ॥ శక్తింతను శూన్యా మీశంచపుమాంసమ్ ।
వక్తిప్రమదాయాంనా సన్దేహయుతోఽన్యః॥ 4

''తనువు లేదమ్మ, కీశునకె మేనున్న'' దని
అనియె స్త్రీయెడ సంశయమున వేఱొక్కరుఁడు।

శక్తియుక్తుఁడగు పురుషునియందు శక్తి యంతర్భవించి యుండుటవలన – శక్తికి పురుషునికంటె వేరగు స్వరూపముండదు. కావున స్త్రీయున్నదను విషయమున సందేహముగల యింకొక పండితుడు ''శక్తికి శరీరము లేదు. ఈశ్వరునకు మాత్రము – పురుష శరీరము కలదు'' అని చెప్పుచున్నాఁడు.

మూ॥ ఈశం చతమేకే సన్మాత్రముశన్తి ।
బ్రహ్మైక మథాఽన్యేగాయన్తి, నశక్తిమ్ ॥ 5

'' అతడు కేవలము సత్యాత్ముఁడం డ్రొకకొంద
అతఁడేకమగు బ్రహ్మ - మతివలే'', దండ్రొకరు ॥

వెనుక శరీరవంతుఁడుగాఁ జెప్పఁబడిన యీశ్వరుఁడు గూడ 'సత్తే (ఉనికియే) స్వరూపముగాఁ గలవాఁడ'ని కొందఱభిప్రాయ పడుచున్నాఁరు.

మఱికొందఱు 'శక్తి లేదు. 'అతఁడు – ఏకమగు బ్రహ్మమే' అని చెప్పుచున్నారు. ' ఏక మేవాద్వితీయం బ్రహ్మ' అను నుపనిషన్మతమిదియే' అని యెఱుంగునది.

మూ॥ కే చిత్తనుహీనం ప్రజ్ఞాయుతమీశం
శక్తిం విదురస్య ప్రజ్ఞామవికుణ్ఠామ్॥ 6

''అతఁడు - ప్రజ్ఞాయుక్తుం - డశరీరుండవికుంఠ
మతవి ప్రజ్ఞయె శక్తి'' యని యందురింకొకరు॥

కొందఱు – ' ఈశ్వరుఁడు శరీరము లేనివాఁడయినను ప్రజ్ఞాయుక్తుఁడై యున్నాఁడు. అప్రతిహతమును, తీవ్రమునునగు నతని ప్రజ్ఞయే–శక్తి' అని చెప్పుదురు.

**ప్రభ:- వివ:-** అశరీరుఁడగు నీశ్వరునకుఁగల స్వతంత్రమగు ప్రజ్ఞయే శక్తియని కొందఱందురని భావము.

మూ॥ ఉక్తం దధత్తస్తైః కేచిత్పున రాహుః।
మాయాతనుబన్ధం నాథస్యనశక్తేః॥ 7

మఱియు ''ప్రజ్ఞశాలి పరమాత్ముఁడే మాయ (లీల)
ధరియించుఁదను, వమ్మ' ధరియింప' దని యంద్రు.

మఱియును కొందఱు పూర్వోక్త ప్రజ్ఞాత్మకమగు శక్తిఁతో గూడిన యీశ్వరుఁడే మాయ (లీల) చేత శరీర బంధమును స్వీకరించుననియును, శక్తి కట్టి శరీర బంధస్వీకారము లేదనియును జెప్పుదురు.

**ప్రభ :-** ' ఈశ్వరునికే లీలా శరీరధారణము కలదు గాని శక్తి లీలా శరీర ధారణము లేదని కొందఱు తలంతురు' అని భావము.



మూ॥ నిత్యం సశరీరౌ యేషాం పితరౌతౌ।
ఏకోఽపృథ వాతా ఽ ప్రత్యాహ విసర్గః॥ 8

జననీజనకులైన, జనకుఁడైనను, నిత్య
తను లన్న వారితోఁ దగవులాడును ప్రకృతి॥

'తల్లిదండ్రులగు నా యీశ్వరీశ్వరులు – నిత్యమును (భూత – భవిష్యద్ – వర్త మానకాలములు మూడింటి యందును) శరీరముతోఁ గూడియుండు వారు' అను వారితోడను, ' ఈశ్వరుఁడొక్కఁడే నిత్యమగుఁ శరీరముతోఁ గూడియుండు వాఁడు, అను వారితోడను గూడ, స్వభావము, తగవులాడుచుండును. ('ప్రత్యుత్తరముఁను జెప్పుచుండును.')

**ప్రభ :-** ఇందలి యాశయమిది :– శరీరము – నిత్యమగుట సంభవము కానేరదు. దృశ్యమగు శరీరము – నశ్యము (నశంపఁదగినది) కాకతప్పదు. కావున నిత్యము కాజాలఁదు.

శరీరము – దేశ – కాల – నిమిత్తముల నపేక్షించుచుండును. ఇట్టి శరీరమునకు నిత్యమును జెప్పుట – స్వభావ విరుద్ధము. కావుననే, ఈశ్వర (ఈశ్వరీ – ఈశ్వరుల) శరీరములకుఁ గాని, ఈశ్వర శరీరమునకుఁ గాని యీశ్వరీశరీరమునకు గాని, నిత్యత్వమును జెప్పువాదము – స్వభావముచే విరోధించును. కావున ప్రకృతి – శరీర నిత్యత్వవాదులతోఁ దగవులాడుట సంగత మగుచున్నది. (స్వభావము వచించు ప్రత్యుత్తరమే తగవులాడుట.)

మూ॥ మాతాపితరౌ, యత్ తావేకశరీరౌ।
చిత్రప్రథనార్థా, సాకాచనలీలా॥ 9

అతఁడు నంబికయు నేకతను సంగతులౌట
అతి చిత్రకృతిజాల - అది యొకానొకలీల.

ఆమాతాపితరు లిద్దరును – 'ఏకశరీరులు' అనునది – అత్యద్భుత విలాస ప్రకాశికయగు నొకానొక లీల!'

**ప్రభ:**- ఇట్లు శ్లోకద్వయమునఁ దల్లిదండ్రులు భిన్న శరీరులనియు – ఏకశరీరమనియుఁ జెప్పువారి మతమునకు సమాదాన మీయఁబడినది.

**అవ:**- అతఁడు కేవలమును సత్తేయను వారి నుద్దేశించి చెప్పుచున్నాఁడు.

మూ॥ సన్మాత్రకథానాం కార్యేమనుజాదౌ !
ధీస్వాన్తవికాసః స్యాత్ కారణహీనః ॥ 10

అతఁడు – 'సన్మాత్రమన, కృతిజనాదులయందు
మతి వికాసాదులే గతి నుద్భవము నొందు?

' ఈశ్వరుండు కేవలమును సత్తగు బ్రహ్మమే' – అనువారి మతమున కార్యమగు మనుష్యాది ప్రపంచమునందగు బుద్ధి మనో వికాసము కారణములేనిది కావలసివచ్చును.

**ప్రభ:**- ఈశ్వరుడు – నిర్గుణమగు బ్రహ్మమగు నెడల అంతఃకరణా విష్కరణము – కారణము లేకయే సంభవము కావలసివచ్చును. కారణము లేనిదే కార్యము పుట్టదుగదా! కారణము నిర్విశేషమగు సద్వస్తువగునెడల దాని యందంతః కరణవ్యాపార మెట్లు సంభవించును?

**అవ** :-కావుననే – అద్వైతులు మాయనాశ్రయించి – స్వపక్షమును స్థాపించుచుందురు. 'వారాశ్రయించుచున్న మాయ– మాచేతఁ బ్రతిపాదింపఁబడు శక్తియే' అని చెప్పుచున్నాఁడు.

మూ ॥ అద్వైతిభి రన్యా మాయాశ్రయణీయా ।
శక్తే రతిరిక్తా సాకింకిమువాదైః ॥ 11



వదల, 'రేదియో మాయ యది' యందు రద్వైతు
లది- శక్తి కంటె వేఱా? వాదమింకేల?

బ్రహ్మము కంటె భిన్నమగు వస్తు వేదియునులేదను నద్వైతులు – పురుషుని కంటె విలక్షణమగుమాయ నాశ్రయింతురు. అది మాచేఁదెలుపఁబడుచున్న శక్తి కంటె వేఱు కానేరదు. ( వ్యర్థములగు వాదములచేఁ బ్రయోజనము లేదు. )

**ప్రభ** :- ఈ విషయమున 'శ్రీభగవద్రమణమహర్షి' రమణగీతయందిట్లు ప్రవచించెను.

'అచలస్యతు యచ్ఛక్తేశ్చలనం లోకకారణమ్।
తామే వాచక్షతే మాయామనిర్వాచ్యాం విపశ్చితః' ॥

'కదలికలేని పరబ్రహ్మము యొక్క యే శక్తి చలనము – లోకములకు కారణమో, ఆ శక్తినే అనిర్వాచ్యమగు ( అట్టిది – ఇట్టిది అని చెప్పుటకు వీలుపడని) మాయయని పండితులు చెప్పుదురు' అని.

**అవ** :- ఈశ్వరుడు – ప్రజ్ఞాయుక్తుఁడు, ఆప్రజ్ఞయేశక్తి, శక్తికి – పురుషుఁడే రూపము, తద్భిన్నమగురూపము అనఁగా, ' ఉనికి లేదని యాఅవశ్లోకమునందుఁ జెప్పఁబడిన యభిప్రాయము – సరియైనది కాదనుచున్నాఁడు.

మూ॥ నస్యాత్ పృథగాత్మా శక్తేః కిముపాధేః ।
చక్షుః శ్రితచిత్తే ర్విశ్వాకృతితావా ॥ 12

అక్షయాత్మ – ఉపాధియైన శక్తికి లేదె?
అక్షి పూరుషున (చేతనున) కన్యముగాదె జగమెల్ల?

ఉపాధియగు శక్తికి వేఱొక స్వరూపము లేదా? ఆమెకుఁ గూడ వేరొక యాత్మయున్నది. కంటియందు వ్యాపించియున్న తేజోరూపుఁడగు పురుషుని కంటె నీ విశ్వాకారము వేరయియుండుట లేదా?

**ప్రభ** :- నేత్రేంద్రియోపహిత చైతన్యముయొక్క విక్షేపరూపమగు వివర్తమే విశ్వాకారమనుకొంద అద్వైతుల సిద్ధాంతమునందైనను, విషయియగు ఉపహితచైతన్యము కంటె – విషయమగు విశ్వాకారము – భిన్నమేయగును.

(కంటియందున్న తేజోరూపుఁడగు పురుషునికంటె తద్విక్షేపరూపమగు వివర్తమయిన ప్రపంచము భిన్నమేయని భావము.)

విషయమునకు – విషయికి – మూల స్వరూపమగు చైతన్యమునందు భేదము లేకున్నను, విషయాకారమున చిత్తునందు వివర్తమానమగు (మార్పునొందిన) విశ్వము – దానికంటె భిన్నమేయగును.

అట్లుకానిచో– జ్ఞాతృ – జ్ఞేయ (తెలిసికొనువాఁడు – తెలియదగినది) అను వ్యవహారమే కుదురకపోవును. కావున – ఉపాధియగు మాయకో – లేక – శక్తికో – వేఱొకయాత్మ యుండకతప్పదని భావము.

(భగవంతుఁడగు రమణమహర్షి 'సద్దర్శనమున,)

శ్లో. ''బోద్ధారమాత్మాన మజానతో యో
బోధః సకిం స్యాత్ పరమార్థబోధః
బోధస్య బోధ్యస్యచ సంశ్రయం స్వం
విజానతః తద్ ద్వితయం వినశ్యేత్?

'' ఎఱిఁగెడు తనను ఎఱుఁగక, యితరము నెఱుగుట యజ్ఞానమే గాని జ్ఞానమగునా? జ్ఞాన– ఇతర (జ్ఞేయ) ముల కాధారమైన తనను ఎఱింగినచో జ్ఞాన జ్ఞేయములు నశించును.'

అని పరమార్థమున – జ్ఞాతృ–జ్ఞాన–జ్ఞేయ విభాగ వ్యవహారము లేదని యీ విషయమున సిద్ధాంతీకరించెను.



**అవ** :– ''మాతాపితరులగు వారెల్లప్పుడును శరీరరహితులే.'' అనునెడల నగు దోషమును దెలుపుచున్నాఁడు.

మూ॥ ఏకాన్త విదేహౌ తౌ చేదతిసూక్ష్మౌ
లీలాతనుబన్ధౌ శక్తావభిధేయౌ ॥ 13

'అతిసూక్ష్ములతను, లాపితరులెప్పుడు నన్య
చతుర లీలాంగ సంయుతులు గారనవలయు.

పరదేవతా పరాత్పరులు అతిసూక్ష్ములు (తెలిసికొనుటకు వీలుకాని వారు) ఏకాంత విదేహులు, అనఁగా నియమముగా శరీర శూన్యులు – అగునెడల, 'వారు – లీలా శరీరధారణమునకు సమర్థులు కారు'' అని చెప్పవలసివచ్చును.

''సర్వతంత్ర స్వతంత్రులగువారు – నిత్యమును శరీర శూన్యులయి యుండునెడల నియామకుడెవ్వఁడగు'' నని భావము.

**అవ** :- ఏదైనను ప్రయోజనము నుద్దేశించి శరీరము కలుగునని చెప్పుచున్నాఁడు.

మూ॥ భక్తాననుగృహ్ణాన్ దివ్యాద్భుత లీలః
తద్విగ్రహబన్ధో బోధ్యోలస దర్థః॥ 14

ఆ విగ్రహములు - భక్తానుగ్రహ మొనర్చు
శ్రీ విలాసాద్భుతము లావిష్కృతార్థములు.

కావున భక్తలోకము ననుగ్రహించునవియు, దివ్యము – అద్భుతము – అగు విలాసము (లీల) గలవియునగు నీశ్వరుల యాకారములు – ప్రకాశమానమగు ప్రయోజనము గలవియే యని గ్రహించునది.

**ప్రభ** :- ఏదోయొక ప్రయోజనము లీలాశరీరమును స్వీకరించుటకై యీశ్వరులను ప్రేరేపించుచుండును. ఆ యీశ్వరులు స్వేచ్ఛచే స్వయం నియామకులును సర్వశక్తులును గావున వారినిట్లు ప్రేరణ మొనర్చు ప్రయోజనము – బాహ్యదృష్టి గోచరము కానేరదు.

**అవ** :- 'పరవస్తువు – పురుషుఁడే కాని స్త్రీ కాదు' అను వాని నడుగుచున్నాఁడు.

మూ॥ స్త్రీత్వం యదినేష్టం, పుం స్త్వంకుత ఇష్టమ్।
నానా కిము నారీ నస్యాదనుమేయా ॥ 15

హితమె పుంస్త్వము? స్త్రీత్వ-మేల యిష్టము గాదో
అతని నట్లామె నేల తలంపఁగా రాదో?

ఆ వస్తువును స్త్రీ యనుట కిష్టములేని యెడల, పురుషుఁడనుటకు మాత్రమేల యిష్టము కావలయును! ఏ ప్రమాణము చేత దానిని పురుషుఁడనుచున్నారో, ఆ ప్రమాణము చేతనే యది స్త్రీయని యూహింపఁదగును గదా!

మూ॥ తస్మాత్ పితరౌతౌ, వాచ్యౌ మతిమన్తౌ।
సూక్ష్మావపిభూయో, లీలాతనుమన్తౌ ॥ 16

పితరులం దెలుపఁదగు – మతిమదగ్రణులనియు,
వ్రతనులైనను సులీలా దేహయుతులనియు

కావున మాతా పితరులను – జ్ఞానవంతులనియు, వేర్వేరగు స్వరూపములు గల వారనియు, చెప్పక తప్పదు. అస్మదాదుల స్థూలదృష్టులకు సూక్ష్మములగు వారి దివ్య శరీరములు కాన్పింపకున్నను, వారు లీలా శరీరులని చెప్పుటయే సమంజసము.



**అవ** :- ఈ బ్రహ్మాండమున ముఖ్యములగు వారి స్వరూపములను రెంటిని జెప్పుచున్నాఁడు.

మూ॥ నాస్మత్తనుపత్తే శక్తీ శ్వరమూర్తీ।
ఏకామృతరూపా త్వన్యా ప్రణవాత్మా ॥ 17

ప్రకృతి మయములుగావు పరమేశ్వరుల మూర్తు,
లొకమూర్తి – అమృత, మింకొకమూర్తి – ప్రణవంబు.

ఆశక్తి మూర్తియు, ఈశ్వర మూర్తియు – మన శరీరముల వంటివి కావు. అందొకమూర్తి– అమృతరూపము. వేఱొకమూర్తి – ప్రణవ ( ఓంకార) రూపము.

**ప్రభ** :- శక్తిమూర్తి కమృతమే శరీరమనియు, ఈశ్వరమూర్తికి ప్రణవ ( ఓంకార) మే శరీరమనియు నెఱుంగునది.

**అవ** :- అందు ప్రణవాత్మయగు మూర్తిని వివరించుచున్నాఁడు.

మూ॥ దివ్యం ఘనతేజః కుర్వద్ ధ్వనిమన్తః
సమ్పశ్య దశేషం మూర్తిః ప్రణవాత్మా ॥ 18

నినద మెల్లెడఁ జేయుచును సర్వమును జూచు
ఘనదివ్య తేజమే ప్రణవాత్మయగు మూర్తి

సర్వమునందును నేదోయవ్యక్తమగు ధ్వనిచేయుచు, ( నాదము నొనర్చుచు) సమస్తమును జూచుచున్న యప్రాకృతమై, స్పర్శాను భవయోగ్యమై, ఘనీభవించియున్న, జ్యోతిస్సే – ప్రణవ శరీరము.

**ప్రభ** :- ఈ బ్రహ్మాండకోటులందంతటను, అత్యంత సూక్ష్మ రూపమున, అణువుకంటెను గూడ సూక్ష్మమై యవ్యక్తమగు నాదమును చేయుచు ప్రకాశించుచున్న తేజస్సే – ఈశ్వరమూర్తి యగు ప్రణవమని భావము.

**అవ** :-అమృతస్వరూపమగు మూర్తిని తెలుపుచున్నాఁడు.

మూ॥ దివ్యోఘనసోమః స్యందన్ రసమన్త ॥
భుఙ్క్ష్వనుభవనౌఘం పీయూష శరీరమ్ ॥ 19

రసమెల్లెడ స్రవించుచు సమస్తము భుజించు
నసమమౌ ఘనసోముఁ డమృతాత్మయగు మూర్తి.

సమస్తలోకములలోపలను, ఆనందమను పదముచేఁ జెప్పఁదగిన విశ్వభూత సారాత్మకమగు రసమును ప్రవహింపఁజేయుచు భోగ్యమగు లోకవ్రాతము యొక్క సారమును గ్రహించుట చేత భోక్తయై, (అనుభవించునదియై) ప్రకృతి సంబంధి కాక, ఘనీభవించిన సోమమే, అమృత స్వరూపమగు మూర్తి. పీయూషమయమగు శరీరమే, అమృతాత్మయగు మూర్తి.

**అవ** :- ప్రణవ స్వరూపమగు తేజస్సు యొక్కయు, అమృత స్వరూపమగు సోమముయొక్కయు, తత్త్వమును (యాదార్థ్యమును) చెప్పుచున్నాఁడు.

మూ॥ బోధోఽనవలమ్బో దివ్యంఖలు తేజ ॥
మోదః పరిశుద్ధో, దివ్యఃఖలు సోమః ॥ 20

అనవలంబము దివ్యమగు బోధమే తేజ
మనఘంబు దివ్యమో హర్షమే సోమంబు.

ఉపాధిరహితము, అప్రాకృతము, అగు జ్ఞానమే తేజస్సు. పరిశుద్ధము, దివ్యము, అగు మోదమే (ఆనందమే) సోమము.

**ప్రభ** :- విషయము నాశ్రయింపక తనంతటతానే సిద్ధించునది – పరిశుద్ధమని చెప్పఁబడును, ఆనందమే సోమమని చెప్పఁబడును.



**అవ** :- ప్రసంగవశమున సూర్యాచంద్రమసుల యాథార్థ్యము నుగ్గడించుచున్నాఁడు.

మూ॥ సోమాంశ మహోంశౌ యాతోఘనభావం।
పిత్రోర్భువనానాం సఙ్కల్ప మహిమ్నా॥ 21

ఘనజగత్పితల సంకల్ప ప్రభావమున
''ఘనములై'' సోమాంశమును మహోంశము నొప్పె.

లోకములకు తల్లిదండ్రులగు ఉమా మహేశ్వరుల సంకల్ప మహిమచేత మీఁద తెలుపబడిన సోమాంశమును తేజోంశమును ఘనీభావము నొందినవి.

**ప్రభ** :- సోమాంశమే గడ్డకట్టిన చంద్రుఁడు. మహోంశమే ఘనీభవించిన సూర్యుఁడు.

**అవ** :- చిన్మయుఁడగు పరమేశ్వరుని (భోక్తను) ఆనందమయియగు దేవి భోగ్యయై తృప్తినొందించుచున్నదనుచున్నాఁడు.

మూ॥ ఆరాధయ శీశం తం చిన్మయకాయం।
ఆనన్దమయాఙ్గీ త్వమ్ దేవీ! కిలేయం॥ 22

మున్మయాంగివగు నీవు మహేశ్వరి! మహేశు
చిన్మయాంగుని సదా సేవించుచుందువట!

దేవీ! ఆనందమయ శరీరుగు నీవు జ్ఞానమయుఁడగు నీశ్వరునారాధించు చున్నావట.

**ప్రభ** :- ఈశ్వరునకు నీయానందమయ శరీరము నర్పించి భోగదానము చేత అతని నారాధించుచుందువని భావము.

**అవ** :- నీకు సంబంధించిన భోగ్యమంతయు దివ్యమే. దానిచే నీవాయీశ్వరు నారాధించుచుందువని యీ కవి దేవి నారాధించుచున్నాఁడు.

మూ॥ దివ్యం తవకాయం దివ్యంతవ వస్త్రే
దివ్యానితవామ్బ ! స్వర్ణాభరణాని ॥ 23

దివ్య దేహావు నీవు దివ్యాంబరవు నీవు
దివ్య హేమాలంకృతివి నీవు జగదంబ !

అమ్మా! నీ శరీరము దివ్యము. ( ప్రకృతి సంబంధికాదు. ) నీ వస్త్రములు ( ఉత్తరీయము, అంతరీయము) దివ్యములు, నీ సువర్ణాభరణములు కూడ దివ్యములే. ఆ స్వర్ణము – పార్థివము కాదని గ్రహించునది.

**ప్రభ** :- కేనోపనిషత్తునందు ప్రతిపాదింపఁబడిన హైమవతియగు ఉమ 'భాసురహేమ' ఇత్యాది పద్యములచే వర్ణింపఁబడెను. మున్ముందుకూడ నిట్లే స్తుతింపబడును. ఇట్లంతటను తెలుపఁబడిన యుమాస్వరూపమంతయు ప్రకృతి సంబంధికాదనియు, దివ్యమేయనియు గ్రహించునది.

**అవ** :- కావుననే చెప్పుచున్నాడు.

మూ॥ యద్దేవి విలోక్యాస్యప్రాకృతకాయా ।
యుక్తీః సమతీతా సేయంతవమాయా ॥ 24

అప్రాకృత శరీరవయ్యుఁ గాన్పింతువది
యప్రమేయ విచారమగు నీ మహామాయ,

దేవీ! నీవు ప్రాకృతమగు ( లౌకికమగు) శరీరముగలదానవు కావు. అయినను మేము నిన్నుఁజూచుటకు శక్తులమగుచున్నా మనునది యూహకు ( ఉపాదాన హేతూక్తులకు) అగోచరమగు నీమాయయే యగును.

**ప్రభ** :- అది యఘటిత ఘటనాపటీయసియగు నీ విచిత్ర శక్తి యగుననియే భావము.

**అవ** :- స్తబకము నుపసంహరించుచున్నాఁడు.



మూ॥ నవ్యాస్తను మధ్యాః ప్రత్నాంతనుమధ్యామ్
విద్వత్సదసీమాః సమ్యక్ ప్రథయన్తు ॥ 25

నూత్తతను మధ్యలా ప్రత్నయగుతను మధ్య
యత్నమున సత్సభలనలరింపఁదగుఁగాత !

క్రొత్తలగు తను మధ్యలు – (తను మధ్యావృత్తములు, సూక్ష్మము అగు నడుములు గల యువతులు) సన్నని నడుము గల పురాతనియగు ప్రాచీన స్త్రీయగు) ఉమా దేవిని – పండితసభ యందు చక్కగాఁ బ్రకాశింపఁజేయును గాత! ( అలంకరించి ప్రకాశింపఁజేయుదురుగాత.)

ఉభయ స్థలములందును గల 'తనుమధ్యా' పదము యొక్క అనురూపతవలన నిది సమాలంకారమగుచున్నది.

సురుచిరాకృతి గణ – స్తుత జాతి పదరీతి
ద్విరదగతి, హైమవతి వెలయించుఁగావుతను ॥

చక్క నిరూపము గలిగి, ప్రమథ గుణములచే స్తుతింపఁబడిన జాతి గల పదముల సంవిధానము గలిగి, ద్విరదగమనము గలిగిన ఉమా దేవతను, చక్కని యాకారము గలిగియున్న గణముల చేతఁ గొనియాడఁబడుచున్న జాతియందగు పదముల రీతి గలిగిన ద్విరదగతియను పద్యము ప్రకాశింపఁజేయును గాక !

తను మధ్య, – గాయత్రీచ్ఛందమునఁ బుట్టిన వృత్తము. ఇందలి గణములు త, య, లు.

**ద్విరదగతి** :- మాత్రాగణ నిబద్ధమగు జాతీయ పద్యము, అయిదు మాత్రల గణములగు, నగ, నలల, భల, సల, త, ర, లిందుండును – రెండేసి పాదముల కొకేప్రాసము నియతమగుచుండును. పదియవ మాత్రయందు విశ్రాంతి యుండును.

ఇది సవ్యాఖ్యమగు తృతీయస్తబకము.

* * * *

ఓమ్ శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః
శ్రీ సరస్వతీ దేవ్యై నమః
ఓమ్ నమో భగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ప్రథమ శతకమునందలి చతుర్థ (నాలుగవ) స్తబకము)

**అవ :-** ప్రథమ శతక సంబంధియగు నీ నాలుగవ స్తబకమున ఆధ్యాత్మమగు మహాశక్తి – కుండలినీ స్వరూపిణిగా స్తుతింపఁబడుచున్నది.

ప్రసంగవశమున ఛాందోగ్య శ్రుతిప్రతిపాదితమగు రీతిననుసరించి – తేజస్సారాంశమగు వాక్కుయొక్కయు, అప్ (జల) సారాంశమగు ప్రాణము యొక్కయు, అన్న సారాంశమగు మనస్సు యొక్కయు, అధిపిండములగు స్థానములను వివరించుచు నైష్ఠికుఁడగు నీయాచార్యుడు – స్వానుభవములను – భగవానుఁడగు రమణమహర్షి యుపదేశములను – తన కవితాచాతుర్యముచేఁ బ్రకటించుచున్నాఁడు.

మూ॥ అమృతాంశు బిమ్బసారాద్
భుయో౽పి వినిర్గతో భృశం సూక్ష్మః।
సారో గౌరీవదనాద్
దరహాసో హరతు దుఃఖజాలం నః॥ 1

గీ. అమృత కరబింబ సారమా హైమవతి ము
ఖమ్మునందుండి మిగుల సూక్ష్మమయి తిరుగ
దొరలుచుండినసార మాదర హసితము-
తొలంగఁజేయును గాత మాదుఃఖసమితి.



గౌరీముఖమునుండి వెలువడిన సారమగు దరహాసము – (చిరునవ్వు) మిక్కిలి సూక్ష్మమును, రసరూపమునునగు అమృతాంశుచంద్ర (చంద్ర) బింబసారము కంటెను మిగుల సూక్ష్మమై, సూక్ష్మ దృష్టులకే గోచరించును. ఆ మందహాసము మాదుఃఖ సమితిని తొలగించుఁగాక!

**ప్రభ :-** ఇంకొక విధమగు నర్థసమన్వయమున నీ శ్లోకార్థము నిట్లెఱుంగునది. 'అమృతాంశు బింబ (చంద్రబింబ) సారమగు గౌరీవదనము నుండి తిరుగ బయలు వెడలుచున్న సారమగు చిరునవ్వు – మా దుఃఖజాలమును నశింపఁజేయు గాత.

**ప్రభ :-** మీఁది యభిప్రాయములు రెండును తెలుఁగు పద్యమునందుఁ గూడఁ గలవని యెఱుంగునది.

అమృతకరబింబ సారమా? హైమవతి... దొరలుచుండి సారము? అను ప్రశ్న రూపమగు నర్థ పర్యాలోచనముచే హైమవతియగు గౌరీదేవి యొక్క ముఖము నందలి సారమగు దరహాసము – చంద్ర బింబసారము కంటెను గూడ సూక్ష్మమగుట చేత నధికమయినదను మొదటి యర్థమును, అమృతకరబింబసారమగు నా యుమాదేవి ముఖము నుండి మిక్కిలి సూక్ష్మమై బయలువెడలుచున్న సారమే ప్రసిద్ధమగు నామె దరహాసము. అని భావించుట చేత రెండవయర్థమును నేర్పడును.

**విశే :-** చిరునవ్వు – సంతోషదాయకము, కావున దుఃఖధ్వంస ముపపన్నమగును. ఆదరహాసము – గౌరీవదనసారమనుట చేత మిక్కిలి సూక్ష్మమయి ఘనీభవించి రసమను మారు పేరుగల యమృతమే – గౌరీముఖమగుచున్నదను నంశమాక్షేపింపఁబడుచున్నది.

శక్తి – అమృత స్వరూపిణియను నంశము – కడచిన స్తబకమునందే ప్రతిపాదింపఁబడినది. ఆయంశము నిచ్చట స్మరించునది.